సాక్షి అనంతపురం

బుధవారం ၊ 15 ၊ మే ၊ 2024



చీనీ టన్ను రూ.34 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.34 వేలు పలికాయి.



ఒత్తిళ్లకు విరామం

8లో

ఎనిమిది నెలలుగా వివిధ కార్యక్రమాల పేరుతో ప్రజల మధ్యనే గడిపిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఒక్కసారిగా రిలాక్స్ అయ్యారు.

గరిష్టం/కనిష్టం

40.1°/23.6°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత స్వల్పంగా తగ్గింది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వడగాల్పులు వీచాయి.

న్యూస్‌రీల్

కౌంటింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లపై కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వివరిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: ఓట్ల లెక్కింపు(కౌంటింగ్) కేంద్రాల్లో ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతపురం పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ జేఎన్‌టీయూలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి సిద్ధం చేస్తున్న కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ మంగళవారం సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్ల గురించి కలెక్టర్‌కు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు, ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు, ఆర్‌ఓ టేబుల్, కౌంటింగ్ టేబుళ్లు, కేంద్రంలో ఇనుప కంచె, స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రానికి తీసుకొచ్చే మార్గం లో ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. అక్కడ చేపట్టాల్సిన పనులకు సంబంధించి తగిన సూచనలు, ఆదేశాలిచ్చారు.

ఎలుగుబంటి కలకలం



చెట్టుపై ఎలుగుబంటి

బొమ్మనహాళ్: మండలంలోని దేవగిరి, ఉద్దేహాళ్, శ్రీనివాస్ క్యాంపు గ్రామాల శివార్లలో ఓ ఎలుగుబంటి మంగళవారం కలకలం సృష్టించింది. స్థానికులు గమనించి కేకలు వేయడంతో చెట్టు పైకి ఎక్కింది. కాసేపటికే దేవగిరి కొండల్లోకి పరుగులు తీసింది. ఎలుగుబంటి సంచారంతో ఆయా గ్రామాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రైతులు పత్తి పొలాల్లోకి వెళ్లాలంటే ఆందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అసహనంతో అరాచకం

ఇన్నాళ్లూ ప్రశాంతంగా ఉన్న తాడిపత్రి పట్టణం జేసీ ప్రభాకర్ రెడ్డి పన్నిన కుట్రతో మళ్లీ రణరంగంలా మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక స్వేచ్ఛా వాతావరణంలో ఊపిరి పీల్చుకున్న స్థానికులు ఒక్కసారిగా బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితికి చేరుకున్నారు.

- తాడిపత్రిలో జేసీ ప్రభాకర్ రెడ్డి బరితెగింపు
- పక్కా ప్రణాళికతో పోలింగ్ రోజు అగ్గి రాజేసిన వైనం
- ఓటమి భయంతో పచ్చ గూండాలను రెచ్చగొట్టి అల్లర్లు
- రెండో రోజు ఏకంగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటిపై దాడి
- భయాందోళనలో బిక్కుబిక్కుమంటున్న స్థానికులు



ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటి వైపు రాళ్లు రువ్వుతున్న జేసీ అనుచరులు

తాడిపత్రి అర్బన్: పోలింగ్ సందర్భంగా తాడిపత్రిలో సోమవారం పచ్చ మూకతో కలిసి అరాచక కాండకు తెరతీసిన జేసీ ప్రభాకర్ రెడ్డి.. రెండో రోజు మంగళవారం కూడా దౌర్జన్యాన్ని కొనసాగించాడు. మొదటి రోజు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై రాళ్ల దాడి చేయించి, ఎమ్మెల్యే, ఆయన తనయుడి వాహనాలను ధ్వంసం చేయించిన జేసీ ప్రభాకర్ రెడ్డి.. మంగళవారం మరింత బరి తెగించాడు. తన అనుచరులతో కలిసి ఏకంగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి నివాసాన్ని చుట్టుముట్టి రాళ్ల వర్షం కురిపించారు. అంతటితో ఆగకుండా బాణాసంచాకు నిప్పంటించి ఎమ్మెల్యే పెద్దారెడ్డి నివాసంపైకి విసిరారు. అడ్డొచ్చిన పోలీసులపైనా రాళ్లు రువ్వారు. తాడిపత్రి అర్బన్ సీఐ మురళీకృష్ణ తలకు రాయి తగలడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఓ బీఎస్‌ఎఫ్ జవాను కంటికి తీవ్ర గాయమైంది. పరిస్థితులు అదుపు తప్పడంతో పోలీసులు భాష్పవాయువును ప్రయోగించారు. జేసీ అనుచరులు విచక్షణ కోల్పోయి దాడులకు దిగడంతో జిల్లా ఎస్పీ అమిత్‌బర్దర్, డీఎస్పీ గంగయ్య, పోలీసు బలగాలు సైతం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారంటే జేసీ ప్రభాకర్ రెడ్డి ఎంతగా బరితెగించారో అర్థం చేసుకోవచ్చు.

ఓటమి భయంతోనే..

ఎన్నికల్లో తమకు ఓటమి తప్పదని గ్రహించే టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి, ఆయన తండ్రి జేసీ ప్రభాకర్ రెడ్డి దాడులకు తెరలేపినట్లు స్పష్టంగా తెలుస్తోంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక గతంలో ఎన్నడూ లేని విధంగా తాడిపత్రి నియోజకవర్గంలో అభివృద్ధి జరిగింది. గతంలో జేసీ ప్రభాకర్ రెడ్డి దౌర్జన్యాలతో విసిగిపోయిన ప్రజలు ఈ ప్రభుత్వంలో స్వేచ్ఛగా ఊపిరిపీల్చుకున్నారు. దీనికితోడు సంక్షేమ పథకాలతో నియోజకవర్గవాసులకు పెద్ద ఎత్తున లబ్ధి చేకూరింది. అదే క్రమంలో అభివృద్ధి పనులు కూడా పెద్ద ఎత్తున జరిగాయి. కాగా, అభివృద్ధి పనుల కారణంగా ఎక్కడ తాము ఉనికి కోల్పోతామోనని భయపడిన జేసీ ప్రభాకర్ రెడ్డి అడుగడుగునా అడ్డు తగిలారు. తాడిపత్రి పట్టణంలో ఆంజనేయస్వామి మాన్యంలో నివసిస్తున్న పేదలకు ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇళ్ల పట్టాలను పంపిణీ చేయగా, ప్రజలకు మేలు జరగడాన్ని ఓర్వలేని జేసీ తన అనుయాయులతో హైకోర్టులో కేసులు వేయించి ఇళ్ల పట్టాల పంపిణీకి అడ్డుపడ్డాడు. అంబేడ్కర్ నగర్‌లోని మున్సిపల్ స్థలంలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని నిర్మించడం జీర్ణించుకోలేక తన అనుచరుడైన టీడీపీ కౌన్సిలర్‌తో హైకోర్టులో పిటిషన్ వేయించి పనులను అడ్డుకున్నాడు. తాడిపత్రిలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే పెద్దారెడ్డి పోలీసులతో చర్చించి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ఒప్పించి ఎస్పీతో శంకుస్థాపన చేయించగా, జీర్ణించుకోలేక దీనిపైనా హైకోర్టులో పిటిషన్ వేయించి స్టే తీసుకొచ్చారు. దీంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి చేయని జేసీ.. వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధి పనులకు అడ్డు తగులుతుండడం చూసి తాడిపత్రివాసులు చీదరించుకోవడం ప్రారంభించారు. ఈ విషయం సోమవారం పోలింగ్ రోజు స్పష్టంగా వెల్లడైంది. జేసీ కుటుంబానికి మళ్లీ బుద్ధి చెప్పేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా తాడిపత్రివాసులు ఓటెత్తారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అయితే, దీన్ని ఓర్వలేని జేసీ ప్రభాకర్ రెడ్డి ఉనికిని కాపాడుకునేందుకు మళ్లీ దౌర్జన్యకాండకు తెరలేపడం గమనార్హం.

డీఐజీ సమీక్ష



పోలీసు, బీఎస్‌ఎఫ్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఐజీ షిమోషీ వాజ్‌పేయ్

తాడిపత్రి/అర్బన్: తాడిపత్రిలో మంగళవారం రాత్రి డీఐజీ షిమోషీ వాజ్‌పాయ్ పర్యటించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి నివాస ప్రాంతాలను పరిశీలించారు. ఘర్షణలకు దారి తీసిన పరిస్థితులపై ఎస్పీ అమిత్ బర్దర్‌ను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలను పూర్తిగా అదుపులోకి తెచ్చేందుకు మరిన్ని పోలీసు బలగాలను తాడిపత్రికి రప్పించారు. డీఐజీతో పాటు కర్నూలు డీఐజీ, ఎస్పీ, కడప, అన్నమయ్య, జిల్లాల ఎస్పీలతో పాటు అదనపు ఎస్పీలు, ట్రైనీ ఎస్పీలు, డీఎస్పీలు తాడిపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. రాళ్ల దాడిలో గాయపడిన అర్బన్ సీఐ మురళీ కృష్ణను డీఐజీ పరామర్శించారు. అదే విధంగా రాళ్ల దాడిలో గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగాలాండ్ బీఎస్‌ఎఫ్ పోలీసును, అస్వస్థతకు గురైన పోలీసు అధికారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.



వైఎస్సార్ సీపీ పోలింగ్ ఏజెంట్ సంజీవకు చెందిన మిక్చర్ బండిని ధ్వంసం చేసిన పచ్చ మూకలు



ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై దాడి చేసేందుకు గుమిగూడిన జేసీ అనుచరులు

పథకం ప్రకారం అంతమొందించేందుకు కుట్ర

- జేసీ ప్రభాకర్ తొత్తులా ఏఎస్పీ రామకృష్ణ
- ఇలాంటి పోలీసును నా రాజకీయ జీవితంలో చూడలేదు
- ఎమ్మెల్యే పెద్దారెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రిరూరల్: పథకం ప్రకారం తనను అంతమొందించేందుకే జేసీ ప్రభాకర్ రెడ్డి బరితెగించాడని ఎమ్మెల్యే పెద్దారెడ్డి అన్నారు. స్థానిక తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి మాట్లాడుతూ.. పోలింగ్ రోజున జేసీ ప్రభాకర్ రెడ్డి తొత్తులా అడిషనల్ ఎస్పీ రామకృష్ణ పనిచేశారని ఆరోపించారు. నా ఓటమి చూడాలన్న లక్ష్యంతో పనిచేసిన ఆయన త్వరలో తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. పోలింగ్ సందర్భంగా జరిగిన గొడవలకు ప్రత్యక్షంగా జేసీ ప్రభాకర్‌రెడ్డి కారణమైతే, వారికి రామకృష్ణ మద్దతిచ్చి పరోక్షంగా కుట్రలో భాగస్వామి అయ్యారన్నారు. పోలింగ్ కేంద్రాల వద్దకు జేసీ ప్రభాకర్‌రెడ్డిని రానీయొద్దని రిటర్నింగ్ అధికారి చెప్పినా రామకృష్ణ పట్టించుకోలేదన్నారు. వందలాది మంది అనుచరులతో పోలింగ్ కేంద్రాల వద్ద హల్‌చల్ చేస్తూ ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసినా చూసీ చూడనట్లు వ్యవహరించాడన్నారు. పోలింగ్ ఏజెంట్‌గా ఉన్న తన పెద్దకుమారుడు హర్షవర్దన్ రెడ్డి వాహనాన్ని తనిఖీ చేసి డ్రైవర్ తప్ప మరెవరు ఉండకూడదని హెచ్చరించాడన్నారు. ఒక పథకం ప్రకారం తనతోపాటు తన కుటుంబాన్ని అంతమొందించడానికి జేసీతో పాటు కుట్ర పన్నారని మండిపడ్డారు. దాడులకు దిగిన పచ్చ మూకపై కాకుండా తనపై అక్రమ కేసులు పెట్టించారని వాపోయారు. ఇలాంటి అధికారిని తన రాజకీయ జీవితంలో ఎన్నడూ చూడలేదన్నారు. టీడీపీ వర్గీయులు రాళ్ల దాడులకు దిగుతున్నా ఎంతో సహనంతో ఉన్న వైఎస్సార్ సీపీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలను భయపడితే ఓటింగ్‌కు రారన్న భ్రమలో జేసీ ప్రభాకర్ రెడ్డి రెచ్చిపోయాడని, అయితే, ఆయన భ్రమలను తారుమారు చేస్తూ ఓటర్లు తండోపతండోలుగా తరలివచ్చి వైఎస్సార్ సీపీకి మద్దతు ప్రకటించారన్నారు. ఇలాంటి ప్రజా చైతన్యాన్ని గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. 'జేసీ ప్రభాకర్ రెడ్డి ఎన్ని కుయుక్తులు పన్నినా నా తలలో వెంట్రుక కూడా పీకలేకపోయారు. గతంలో నాపై కక్ష కట్టిన అధికారులు ఇప్పుడు ఏమయ్యారో, ఎలా ఉన్నారో అందరికీ తెలుసు. ప్రజల అండతో త్వరలో మా పార్టీ మళ్లీ అధికారంలోకి రాబోతోంది. నేడు రాక్షసంగా వ్యవహరించిన పచ్చ మూకను, వారికి సహకరించిన ఏ ఒక్క అధికారినీ వదిలి పెట్టేది లేదు. నాపై బనాయించిన కేసులపై కోర్టులో న్యాయ పోరాటం చేయడమే కాకుండా ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేసి జేసీ అరాచకాలకు చరమగీతం పాడుతా' అని ఎమ్మెల్యే పెద్దారెడ్డి పేర్కొన్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో పోలింగ్ శాతం పెరగడానికి కారణమైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను ఆయన అభినందించారు.

ఈవీఎంల్లో అభ్యర్థుల భవితవ్యం

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన ఘట్టం పోలింగ్ ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలో నిక్షిప్తం అయ్యింది. జేఎన్‌టీయూలో నియోజకవర్గాల వారీగా ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూముల్లో ఆయా నియోజకవర్గాల ఈవీఎంలను భద్రపరిచారు. అన్ని నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలు మంగళవారం తెల్లవారుజామునకు వాహనాల ద్వారా జేఎన్‌టీయూకు చేరుకున్నాయి. పోలింగ్ కేంద్రాల ప్రిసైడింగ్ అధికారులు వాటిని ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల సమక్షంలో స్వాధీనం చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచే ప్రక్రియను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్, ఎన్నికల కమిషన్ సాధారణ పరిశీలకులు మనీష్ సింగ్, అజయ్‌నాథ్ ఝ సమక్షంలో అధికారులు మంగళవారం నిర్వహించారు. ఎనిమిది నియోజకవర్గాలకు సంబంధించి వాటికి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ల్లో ఉంచిన ఈవీఎంలను నియోజకవర్గాల వారీగా కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. వాటికి సంబంధించిన ఫారాలను పరిశీలించారు. అనంతరం స్ట్రాంగ్‌రూమ్‌లకు కలెక్టర్, పరిశీలకులు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీల్ వేశారు. సీల్‌పై కలెక్టర్, పరిశీలకులు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతకాలు చేశారు.

పటిష్ట బందోబస్తు నిర్వహించాలి

ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పటిష్ట బందోబస్తు నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. 24 గంటలూ నిఘా ఉంచాలన్నారు. స్ట్రాంగ్‌రూమ్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరంతరం పనిచేస్తూ ఉండాలన్నారు. గదులవైపు ఏ ఒక్కరూ రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు ఉన్నారు.



స్ట్రాంగ్‌రూమ్‌కు సీల్ వేస్తుండడాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, పరిశీలకులు

'అసెంబ్లీ'ల్లో 81.10.. 'పార్లమెంట్' 80.53

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్‌లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో రాత్రి 12 గంటల వరకు పోలింగ్ కొనసాగిందంటే ఓటు వేసేందుకు ప్రజలు ఏస్థాయిలో ఉత్సాహం చూపారనేది స్పష్టమవుతోంది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ 81.10 శాతం నమోదైంది. అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గం (ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు) పరిధిలో 80.53 శాతం పోలింగ్ నమోదయ్యింది. 2019 ఎన్నికల కంటే ఈ ఎనికల్లో పోలింగ్ శాతం 0.3 శాతం అధికంగా నమోదు కావడం గమనార్హం. అప్పటి ఎన్నికల్లో 80.80 శాతం పోలింగ్ కాగా ఈ ఎన్నికల్లో 81.10 శాతం నమోదయ్యింది.

కళ్యాణదుర్గంలో అత్యధికం..

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 20,18,161 ఓట్లు ఉండగా 16,36,648 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషులు 8,17,536 మంది(49.95శాతం),మహిళలు 8,19,004 మంది (50.04 శాతం), ఇతరులు 108 మంది(0.01శాతం) తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అత్యధికంగా 88.89 శాతం పోలింగ్ నమోదయ్యింది.

మొత్తం ఓట్లు (ఎనిమిది అసెంబ్లీలు)	20,18,162
పోలైన ఓట్లు	16,36,648
పోలింగ్ శాతం	81.10
పార్లమెంట్ నియోజకవర్గం	
ఏడు నియోజకవర్గాల్లో ఓట్లు	17,67,591
పోలైన ఓట్లు	14,23,441
పోలింగ్ శాతం	80.53

అధిక సంఖ్యలో మహిళల ఓట్లే

అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పురుషుల ఓట్లు 49.89 శాతం, మహిళల ఓట్లు 50.10 శాతం, ఇతరుల ఓట్లు 0.08 శాతంగా నమోదయ్యాయి. అనంతపురం పార్లమెంట్ పరిధిలోకి రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, అనంతపురం అర్బన్, కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గం హిందూపురం పార్లమెంట్ పరిధిలోకి వెళుతుంది. రాప్తాడు మినహా ఏడు నియోజకవర్గాల పరిధిలో 17,67,591 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో 14,23,441 మంది (80.53 శాతం) ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషులు 7,10,187 మంది(49.89 శాతం), మహిళలు 7,13,148 మంది (50.10 శాతం), ఇతరులు 106 మంది (0.08 శాతం) తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన పురుష ఓట్లు	మహిళా ఓట్లు	ఇతరుల ఓట్లు	మొత్తం ఓట్లు	పోలింగ్ శాతం
రాయదుర్గం	2,64,352	1,13,978	1,13,253	17	2,27,248	85.96
ఉరవకొండ	2,24,339	96,241	96,182	18	1,92,441	85.78
గుంతకల్	2,70,648	1,01,539	1,02,251	30	2,03,820	75.31
తాడిపత్రి	2,48,880	1,02,898	1,03,792	13	2,06,703	83.05
శింగనమల	2,47,373	1,03,428	1,01,610	20	2,05,068	82.89
అనంతపురం	2,81,214	89,188	93,825	5	1,83,018	65.08
కళ్యాణదుర్గం	2,30,785	1,02,905	1,02,235	3	2,05,143	88.89
రాప్తాడు	2,50,571	1,07,349	1,05,856	2	2,13,207	85.09
మొత్తం	20,18,162	8,17,536	8,19,004	108	16,36,648	81.10

కాయ్ రాజా కాయ్..

- జిల్లాలో జోరుగా బెట్టింగ్‌లు

సాక్షి, అనంతపురం: జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఇక ఓట్ల లెక్కింపునకు 20 రోజులు గడువు ఉండగా, అప్పుడే బెట్టింగ్‌లు ప్రారంభమయ్యాయి.ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుస్తారనే మెజార్టీ స్థాయిలో బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమలు చేసిన సంక్షేమ పథకాలకు తోడు పెద్ద ఎత్తున జరిగిన అభివృద్ధి పనులతో జనమంతా అధికార పార్టీ వైపే మొగ్గు చూపారని ఇప్పటికే పలు సర్వేలు వెల్లడించాయి. ఈ క్రమంలోనే బెట్టింగ్ రాయుళ్లు కూడా ఆ పార్టీ గెలుస్తుందనే పందేలు వేస్తున్నట్లు సమాచారం. జిల్లాలో ఏడు స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ గెలుస్తుందని బెట్టింగ్ కడుతున్నట్లు చర్చ జరుగుతోంది. జిల్లాకు చెందిన వారే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటకవాసులు కూడా మన జిల్లాకు సంబంధించి పలు స్థానాలపై బెట్టింగ్‌లు వేస్తున్నట్లు తెలిసింది. ఇదే క్రమంలో పలు నియోజకవర్గాలకు సంబంధించి ఎవరు గెలుస్తారనే దానిపైనే కాకుండా ఆయా స్థానాల్లో అధికార పార్టీ అభ్యర్థికి ఎంత మెజార్టీ వస్తుంది, కూటమి అభ్యర్థులు ఎంత చిత్తుగా ఓడతారనే దానిపై కూడా పందెం కాస్తున్నట్లు సమాచారం.

ఎన్‌ఎస్‌జీ కమాండర్ ఆత్మహత్య

కొత్తచెరువు: ఎన్ఎస్‌జీ కమాండర్‌గా పనిచేసే మండలానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఎర్రబల్లి గ్రామానికి చెందిన బోయ నరసింహులు కుమారుడు చెన్నుడు (34) ఆదివారం రాత్రి ఢిల్లీలోని తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అస్సాం రైఫిల్స్‌లో ఉద్యోగ జీవితం ప్రారంభించిన చెన్నుడు...ఆ తర్వాత వీవీఐపీల రక్షణ బాధ్యతలు చూసే నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ) విభాగానికి బదిలీ అయ్యారు. శిక్షణ నిమిత్తం రెండు నెలల క్రితం ఢిల్లీకి వచ్చాడు. ఈ క్రమంలోనే ఈ నెల 12వ తేదీ రాత్రి తన ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మానసిక ఒత్తిడి కారణంగానే చెన్నుడు ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు తెలిపారు. మంగళవారం చెన్నుడు మృతదేహాన్ని స్వగ్రామం ఎర్రబల్లికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

మళ్లీ మా ప్రభుత్వమే

- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ
- జూన్ 4 తర్వాత టీడీపీ కనుమరుగు : పార్టీ అధ్యక్షుడు పైలా



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ, చిత్రంలో పైలా

అనంతపురం కార్పొరేషన్: మళ్లీ రాబోయేది తమ ప్రభుత్వమే అని వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలసి ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. సంక్షేమ పథకాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాలకూ అండగా నిలిచారన్నారు. అందుకే వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించేందుకు పోలింగ్ రోజు రాత్రి 11 గంటల వరకూ కేంద్రాల్లో ప్రజలు బారులు తీరారన్నారు. జగనన్నకు జై కొట్టిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, విప్లవాత్మక సంస్కరణలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల కృషితో మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రానుందన్నారు. జూన్ 4 తర్వాత టీడీపీ కనుమరుగవుతుందని, లేకుంటే బీజేపీలో విలీనమవుతుందని జోస్యం చెప్పారు. పోలింగ్ రోజున తరలివచ్చి వైఎస్సార్ సీపీకి ఓటు వేసిన మహిళలు, అన్ని వర్గాల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్న జిల్లా పోలీసులకు అభినందనలు తెలియజేశారు. టీడీపీ నాయకులకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే రాష్ట్రంలో దౌర్జన్యాలు, దాడులు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు ఛీ కొట్టినా పచ్చ మూకలకు బుద్ధి రావడం లేదన్నారు. సమావేశంలో తాడిపత్రి మార్కెట్ యార్డు చైర్మన్ హరినాథ్ రెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్నోబులేసు, నాయకులు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

'మెగా సప్లిమెంటరీ' నోటిఫికేషన్ విడుదల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడానికి సంబంధించిన నోటిఫికేషన్ మంగళవారం విడుదలైంది. దరఖాస్తులకు జూన్ 14 వరకూ అవకాశం కల్పించారు. రూ.1,000 అపరాధ రుసుంతో ఈ నెల 21 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రూ. 3,000 అపరాధ రుసుముతో 28వ తేదీ వరకు, రూ.5,000 అపరాధ రుసుముతో జూలై 1 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతపురం కేఎస్‌ఎన్ డిగ్రీ బాలికల కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు.

- ఒక్కో సబ్జెక్టుకు రూ.1000, రెండు సబ్జెక్టులు రూ.3,000, మూడు సబ్జెక్టులు ఆపైన ఫెయిల్ అయి ఉంటే రూ.4,000 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- డిగ్రీ మొదటి, రెండో సంవత్సరం ఉత్తీర్ణులై, మూడో సంవత్సరంలో పరీక్షలు రాయకుండా ఉంటే రూ.3,000 అదనంగా అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుంది.
- 1994–95 విద్యా సంవత్సరం నుంచి 2014–15 విద్యా సంవత్సరం వరకు చదివిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- 2008–09 విద్యా సంవత్సరం నుంచి రాయలసీమ వర్సిటీ ఏర్పాటైన నేపథ్యంలో.. అంతకుముందు ఎస్కేయూ పరిధిలో చదువుకున్న కర్నూలు జిల్లా విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- అభ్యర్థులు గతంలో పరీక్ష రాసిన హాల్‌టికెట్ గానీ, మార్క్సుకార్డు గానీ దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది.

ఎంతోమందికి ఊరట..

గతంలో అనివార్య కారణాలతో డిగ్రీ పూర్తి చేయలేనివారు, బ్యాక్‌లాగ్స్ (ఫెయిల్ అయినవారు) ఉన్నవారికి ఊరట కలిగించే ఈ నిర్ణయాన్ని ఇటీవలే ఎస్కేయూ ఉన్నతాధికారులు తీసుకున్నారు. డిగ్రీ ఫెయిల్ అయి పట్టా పొందలేని పరిస్థితుల్లో పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యే సదవకాశాన్ని కల్పిస్తున్నారు. ఎన్ని సబ్జెక్టులు ఫెయిల్ అయినా, వాటిన్నింటినీ రాయడానికి వీలు కల్పించారు.

క్లుప్తంగా

పోలీసు వాహనం బోల్తా



కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి సమీపంలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో పోలీసుల వాహనం బోల్తా పడింది. ఘటనలో ఎన్నికల విధులు ముగించుకుని తిరిగి రాయదుర్గానికి వెళ్తున్న రూరల్ సీఐ శ్రీనివాసులు, డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

జిల్లాకు వర్ష సూచన

బుక్కరాయసముద్రం: ఉమ్మడి జిల్లాలో ఈ నెల 17, 19వ తేదీల్లో చిరు జల్లులు నుంచి తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 36.8–38.6 రాత్రి ఉష్ణోగ్రతలు 23.2–27.2 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చు అన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 57–67 శాతం, మధ్యాహ్నం 31–44 శాతంగా నమోదు అయ్యే అవకాశం ఉందన్నారు.

ప్రథమ చికిత్స కేంద్రాలతో మెరుగైన సేవలు

అనంతపురం మెడికల్: ఎన్నికల పోలింగ్ రోజున జిల్లాలోని వివిధ కేంద్రాల్లో 2236 ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 12న నియోజకవర్గాలకు ఈవీఎం పంపిణీ కేంద్రాల వద్ద, 13న ఈవీఎంల రిసీవింగ్ కేంద్రం జేఎన్టీయూ వద్ద సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే వరకూ, ఈ నెల 14న కూడా ప్రథమ చికిత్స కేంద్రాల ద్వారా ప్రజలు, సిబ్బందికి సేవలందించినట్లు పేర్కొన్నారు.

భార్యపై క్రికెట్ బ్యాట్‌తో దాడి

గార్లదిన్నె: క్షణికావేశంలో భార్యపై భర్త క్రికెట్ బ్యాట్‌తో దాడి చేశాడు. వివరాలు... గార్లదిన్నెకు చెందిన ఎర్రిస్వామి, అంజలి దంపతులు. మంగళవారం ఉదయం చిన్నపాటి విషయానికి దంపతుల మధ్య ఘర్షణ చెలరేగింది. ఆ సమయంలో క్షణికావేశానికి లోనైన భర్త చేతికి అందుబాటులో ఉన్న క్రికెట్ బ్యాట్ తీసుకుని అంజలిపై దాడి చేశాడు. తలకు తీవ్ర గాయమైన ఆమెను కుటుంబసభ్యులు అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

‘అనంత’ సేవా కుసుమాలు

- ‘ఇన్నర్ వీల్’ అతివల సేవలు స్ఫూర్తిదాయకం

అనంతపురం కల్చరల్: అంతులేని సహనం.. అమితమైన ఓర్పు.. తమకు మాత్రమే సొంతమైన తెలివితేటలకు నిలువెత్తు దర్పణంగా నిలిచే మహిళలు సేవా రంగంలోనూ ఓ చరిత్ర సృష్టించారు. ఒకప్పటి మహిళలు వంటింటికే పరిమితమైనా... పరిస్థితులకు అనుగుణంగా పురుషులకు దీటుగా ఆధునిక మహిళ అన్ని రంగాల్లోనూ రాణిస్తోంది. ఓ గృహిణిగా తన ఇంటిని చక్కబెట్టుకుంటూనే మరో వైపు తాను ఎంచుకున్న వృత్తిలో అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. సేవా ఉత్తుంగ తరంగాలుగా ఎగిసి ఎందరికో ‘అనంత’ మహిళలు ఆదర్శంగా నిలిచారు.

వందేళ్ల క్రితం ప్రారంభమై...

సేవారంగం పేరు తలచుకుంటే రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్బు మొదట గుర్తొస్తాయి. రోటరీ క్లబ్‌కు అనుబంధంగా కేవలం మహిళలు మాత్రమే సేవలందించే సంస్థనే ఇన్నర్ వీల్. ఈ ఏడాది నూరో వసంతంలోకి అడుగుపెడుతున్న ఇన్నర్‌వీల్... రోటరీ చాటుగా ఉన్నా స్వతంత్రంగా ఎన్నో స్ఫూర్తిదాయక



ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు

కార్యక్రమాలతో మమేకమవుతోంది. సేవకు మారు పేరుగా నిలిచి 1924లో ఆరంభమైన ఇన్నర్‌వీల్ 1975లో ‘అసోసియేషన్ ఇన్నర్‌వీల్ క్లబ్స్ ఆఫ్ ఇండియా’ పేరుతో అనంతలోనూ పురుడు పోసుకుంది. సేవకు ప్రత్యామ్నాయ పదంగా మారి అతివలు సేవల్లోనూ ముందంజలో ఉంటారని నిరూపిస్తోంది.

అతివల చైతన్య స్ఫూర్తి

అనంతలో ప్రారంభమైన ఇన్నర్‌వీల్‌కు ఈ ఏడాది 50 ఏళ్లు నిండి స్వర్ణోత్సవాలు చేసుకుంటోంది. తొలి డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్‌గా సీతాకుమారితో ప్రారంభమైన ప్రస్థానం తర్వాత కట్టా శ్యామల, శ్రీవల్లి, పద్మ, ప్రతిమ వంటి వారితో అనేక ఆదర్శ ప్రాయ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. నిత్య సేవా కార్యక్రమాలతో జన చైతన్యమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఉచిత కంటి ఆపరేషన్లు, పల్స్‌పోలియో, ఆరోగ్యశిబిరాలు, పాఠశాలలను దత్తత తీసుకుని అందులో సౌకర్యాలు కల్పించడం, పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటడం, వృద్ధాశ్రమాలకు, అనాథాశ్రమాలకు నిత్యావసరాలు అందించడం, బాలికల భవితకు ప్రత్యేక కృషి చేయడం తదితర కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నారు. ముఖ్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఏడాదిలో ‘సర్వైకల్ కాన్సర్ వాక్సినేషన్’ ఉచితంగా అందించడానికి సన్నాహాలు చేసింది. అయితే ఇన్నర్ వీల్ మహిళలు గత రెండేళ్లుగా ఎన్నో వ్యయ ప్రయాసలతో ఈ బృహత్ కార్యక్రమాన్ని స్ఫూర్తివంతంగా నిర్వహిస్తున్నారు.

ఆకట్టుకునే సస్తాబజార్

ఇంట్లో అదనంగా ఉండే విలువైన వస్తువులను ఇన్నర్‌వీల్ సభ్యులు చారిటీ ట్రస్ట్‌కు ఉచితంగా ఇచ్చేస్తారు. అలా పోగు చేసిన వాటిని వీధుల్లో నామమాత్రపు ధరకు విక్రయించి సంస్థకు నిధిని సమకూరుస్తారు. ఈ కార్యక్రమం ద్వారా మధ్య తరగతి, పేద వర్గాలకు తక్కువ ధరలో నాణ్యమైన వస్తువులను కొన్నామన్న తృప్తి కల్గిస్తే, నిరుపయోగంగా ఉండే వాటిని సేవాభావంతో అందిస్తున్న సంతృప్తిని ధనిక వర్గాలకు సస్తా బజార్ కార్యక్రమం ద్వారా చేరువ చేశారు.

అందరి సహకారంతో..



రోటరీ క్లబ్ అంటే అంతర్జాతీయంగా సేవా తత్పరతకు చిరునామాగా నిలిచింది. సేవాభావం ఉన్న వారు రోటరీ క్లబ్‌లో సభ్యులవుతున్నారు. ఆ సభ్యుల భార్యలు ఇన్నర్‌వీల్ సంస్థలో సభ్యులుగా ఉంటూ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. మేము స్వతంత్రంగా ఎన్నో స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలను ఇప్పటి వరకూ విజయవంతంగా నిర్వహించాం. మరెన్నో కార్యక్రమాలను రూపొందించాం. కలెక్టర్‌తో పాటూ అధికారులందరి సహకారం తీసుకుంటున్నాం. సేవలో సంతృప్తి పొందాలనుకునేవారికి ఇన్నర్‌వీల్ క్లబ్ చక్కటి మార్గం. – పీటీ పద్మ, చైర్‌పర్సన్, ఇన్నర్‌వీల్ క్లబ్

మా వంతు సహకారమందిస్తున్నాం



మహిళలను సేవా కార్యక్రమాలలో భాగస్వాములను చేస్తున్న ఇన్నర్‌వీల్ సంస్థకు మా వంతు సహకారం అందిస్తున్నాం. ట్రాఫిక్ అవేర్‌నెస్‌పై జిల్లా అధికారులతో కలసి చేసిన ప్రోగ్రాం మాకెంతో పేరు ప్రఖ్యాతలను తీసుకొచ్చింది. అలాగే సంస్థ నిర్వహిస్తున్న సస్తాబజార్‌లో వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా నిధిని సమకూర్చడంలో మేమూ ముందుంటున్నాం. తక్కువ ధరకే మంచి వస్తువులు ఇంటికి చేరుతాయి. – ఎన్.కవిత, ప్రైవేటు స్కూల్ టీచర్

మహమ్మారి బారిన పడకుండా



ఇన్నర్‌వీల్ సంస్థ ద్వారా సాగుతున్న కార్యక్రమాల్లో అద్భుతమైనది సర్వికల్ కాన్సర్ వాక్సినేషన్ ఒకటి. మహిళలకు ప్రాణాంతకమైన మహమ్మారి సర్వికల్ క్యాన్సర్ బారిన పడకుండా ఈ వ్యాక్సిన్ దోహదపడుతుంది. ఒక్కో ఇంజక్షన్ దాదాపు రూ. 3 వేలు ఉంటుంది. లాస్ట్ ఇయర్ నేను రోటరీ స్కూల్లో చదువుకుంటున్నప్పుడు ఉచితంగా వ్యాక్సిన్ వేయించుకున్నా. మా స్కూల్లో పదో తరగతి చదువుతున్న అమ్మాయిల్లో 18 మందికి రెండు విడతులగా వ్యాక్సిన్‌ను అందజేశారు. – దర్శిత, ఇంటర్ విద్యార్థిని

సౌకర్యవంతంగా వైద్య సేవలు



జీజీహెచ్‌లోని ఓపీ బ్లాక్

అనంతపురం మెడికల్: ఇటీవల ప్రభుత్వ నిధులతో ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఆవరణలో ఏర్పాటు చేసిన నూతన ఓపీ, ఐపీ బ్లాక్ ఎంతో ఉపయోగకరంగా మారింది. సర్వజనాస్పత్రిలో వివిధ విభాగాల్లో పునరుద్ధరణ పనుల కోసం ప్రభుత్వం రూ.3.5 కోట్ల నిధులు కేటాయించింది.ఈ నిధులతో అన్ని విభాగాలు అధునాతనంగా రూపుదిద్దుకుంటున్నాయి. గతంలో ఆస్పత్రిలో ఉన్న ఓపీ బ్లాక్‌లో ఓపీ టికెట్ పొందాలంటే పురుషులు, మహిళలు చాలా ఇబ్బంది పడేవారు. ఈ సమస్యకు చెక్‌ పెడుతూ ఆస్పత్రి ఆవరణలోని ఓపీ బ్లాక్‌లో రెండు గదుల్లో పురుషులు, మహిళలు, వికలాంగులు, తదితరుల కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. నూతన ఓపీ బ్లాక్ ఏర్పాటుపై రోగులు, వారి సహాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బ్రాహ్మణ ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: బ్రాహ్మణ విద్యార్థినీ మహిళా సంక్షేమ సంఘం ద్వారా ప్రతిభ గల పేద బ్రాహ్మణ విద్యార్థినులకు ఉపకార వేతనాలందిస్తున్నారు. ఈ మేరకు ఆ సంఘం కార్యదర్శి రమాదేవి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 6వ తరగతి నుంచి పీజీ చదువుతున్న ప్రతిభ కలిగిన పేద విద్యార్థినులు అర్హులు. పూర్తి వివరాలకు 9703789201, 9490130999లో సంప్రదించవచ్చు.

రాష్ట్రంలో మళ్లీ ఫ్యాన్ ప్రభంజనమే

- పోటెత్తిన మహిళలు, వృద్ధుల ఓట్లే ఇందుకు నిదర్శనం
- రాప్తాడులో గతం కంటే మెజార్టీ పెరుగుతోంది
- నియోజకవర్గాన్ని వైఎస్సార్‌సీపీకి కంచుకోటలా మార్చేస్తాం
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: పోలింగ్ సరళిని పరిశీలిస్తే రాష్ట్రంలో మళ్లీ ఫ్యాన్ ప్రభంజనం సృష్టించబోతున్నట్లు స్పష్టమవుతోందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి బూత్ వద్ద ఉదయం నుంచే మహిళలు బారులు తీరారన్నారు. వృద్ధులు, మహిళలు అత్యధిక సంఖ్యలో పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరడం, స్వచ్ఛందంగా ఓటర్లు ఇళ్ల నుంచి వచ్చి ఓట్లు వేయడం వంటివి గమనిస్తే జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకునేందుకు వచ్చినట్లు అర్థమైందన్నారు. రాప్తాడులో తాను బంపర్ మెజార్టీతో గెలవబోతున్నానన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుకూలంగా ఓటింగ్ జరిగిందన్నారు. టీడీపీ కార్యకర్తల కుటుంబాల్లోని మహిళలు కూడా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేశారన్నారు. ఎన్నికలకు ముందు నియోజవర్గంలో 14 వేల ఓట్లు తొలిగించడం, ఆర్‌ఓలు, అధికారులను మార్పించడం, చివరకు తన కుటుంబ సభ్యుల ఓట్లు, మైనార్టీల ఓట్లను పెద్ద సంఖ్యలో తొలిగించడం వంటి ప్రతిపక్ష పార్టీల కుయుక్తుల ఎత్తులను ప్రజలు చిత్తు చేశారన్నారు. ఓట్లు తొలగించిన అర్హులు దరఖాస్తు చేసుకుంటే కూడా అడ్డుకున్నారన్నారు. అధికారులు, బీఎల్‌ఓలకు పెద్ద ఎత్తున ప్రలోభాలకు గురి చేశారన్నారు. పరిటాల సునీత కుమారుడు, సోదరుడు పోలింగ్ బూత్‌ల్లోకి వెళ్లే ప్రయత్నం చేశారన్నారు. రామగిరి మండలం కొండాపురంలో ప్రజలు తిరగబడ్డారని గుర్తు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పేలవమైన పోలిస్ బందోబస్తు ఏర్పాటు చేశారని వాపోయారు. ఎన్ని కుయుక్తులు చేసినా మెజార్టీ తగ్గించగలుగుతారేమోకాని ఫ్యాన్ ప్రభంజనాన్ని ఆపలేరన్నారు. చాలా బూత్‌ల్లో పోలింగ్ సరళిని గమనించిన టీడీపీ ఏజెంట్లు బయటకు వచ్చిన పరిస్థితులు కనిపించాయన్నారు. నియోజకవర్గంలో గత మెజార్టీ కంటే ఈసారి పెరుగుతుందన్నారు. ప్రతి సామాజిక వర్గమూ జగనన్నకు దన్నుగా నిలిచిందన్నారు. రాప్తాడును జగనన్నకు కానుకగా ఇవ్వాలనే పట్టుదలతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పని చేశారన్నారు. అందుకు కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీకి రాప్తాడు నియోజకవర్గం కంచుకోటలా మార్చేస్తామని స్పష్టం చేశారు. రాప్తాడు ప్రజల గళాన్ని మరోమారు అసెంబ్లీలో వినిపించబోతున్నానని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో రాప్తాడు వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, ఎంఐఎం అలీ పాల్గొన్నారు.

రెండోసారి అధికారం ఖాయం

- ఉరవకొండలో వైఎస్సార్‌సీపీ గెలుపు బావుటా
- ఓటమి భయంతోనే టీడీపీ అభ్యర్థి కేశవ్ దౌర్జన్యాలు, ప్రలోభాలు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వ



మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ రెండోసారి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ ఉరవకొండ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళిని బట్టి చూస్తే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు. నియోజకవర్గంలో 86 శాతం ఓటింగ్ నమోదు కావడం ఓ రికార్డన్నారు. ఓటమి భయంతో వై.రాంపురంలోని పోలింగ్ బూత్‌లో రౌడీషీటర్లు సంజీవరాయుడు, శివశంకర్‌ని టీడీపీ అభ్యర్థి కేశవ్ ఏజెంట్లుగా పెట్టుకుని దౌర్జన్యాలకు పాల్పడ్డాడని మండిపడ్డారు. బెళుగుప్పకు చెందిన సీనియర్ నాయకుడు శివలింగప్ప, కూడేరు మండలం మరుట్ల గ్రామానికి చెందిన శ్రీనివాసులుపై టీడీపీ గుండాలు దాడి చేయడాన్ని ఖండించారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కొకుంట్ల, రాంపురం, మైలారంపల్లి, రాచేపల్లి గ్రామాల్లో ప్రజలు ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవడం స్వాగతించదగ్గ విషయమన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి చేసిన నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, పోలీసు అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తనతో పాటు రేయింబవళ్లు ఈ 45 రోజుల పాటు కష్టపడి పనిచేసినా పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, నాయకులు సీపీ వీరన్న, మచ్చన్న, భీమిరెడ్డి, తేజోనాథ్, బసవరాజు, మూలగిరిపల్లి ఓబన్న, మాజీ జెడ్పీటీసీ తిప్పయ్య, బూదగవి ధనుంజయ పాల్గొన్నారు.

కొకుంట్లలో వెల్లివిరిసిన ఓటరు చైతన్యం



వై.రాంపురంలో బారులు తీరిన ఓటర్లు

ఉరవకొండ: మండలంలోని కొకుంట్ల పంచాయతీలో ఈ సారి ఓటరు చైతన్యం వెల్లివిరిసింది. గతంలో పంచాయతీకి చెందిన పెత్తందార్లు చెప్పిందే వేదంగా గ్రామస్తులు నడుచుకునేవారు. ఎన్నికలు వస్తే ప్రజల ఓటును కుడా పెత్తందార్లే వేసి ప్రజాస్వామ్యాన్ని కాలరాసేవారు. ఓటు వేయాలని ఎవరైనా సాహసం చేస్తే పెత్తందార్ల దౌర్జన్యాలకు గురి కాకతప్పదు. వారి మాట వినకపోతే హతమార్చేందుకు సైతం వెనుకాడని రోజులున్నాయి. తాజా ఎన్నికల్లో ఇందుకు భిన్నమైన పరిస్థితులు వ్యక్తమయ్యాయి. కొకుంట్ల పంచాయతీ పరిధిలోని వై.రాంపురం, మైలారంపల్లి, రాచేపల్లి గ్రామాల్లో ప్రజలను చైతన్యవంతులను చేయడంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తీవ్రంగా శ్రమించారు. పెత్తందార్లకు వ్యతిరేకంగా ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించారు. దీంతో సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్‌లో కొకుంట్ల, వై.రాంపురం, మైలారంపల్లి, రాచేపల్లి గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రజలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మైలారంపల్లి గ్రామంలో 952 మందికి గాను 826 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొకుంట్లలోనూ 70 శాతం పోలింగ్ జరిగింది.

లోకలైజేషన్ పైలాన్ ధ్వంసం



శింగనమల చెరువు వద్ద ఏర్పాటు చేసిన పైలాన్ బండలను ధ్వంసం చేసిన దృశ్యం

శింగనమల: ఓటమి భయంతో శింగనమల టీడీపీ నాయకులు విధ్వంసాలకు తెరలేపారు. శింగనమల రంగరాయుల చెరువు లోకలైజేషన్‌కు సంబంధించి పైలాన్‌ను ధ్వంసం చేశారు. వివరాలు.. దాదాపు ఐదు దశాబ్దాలుగా శింగనమల చెరువు లోకలైజేషన్ అంశం నలుగుతూ వచ్చింది. ఎన్నికల సమయంలో చెరువును లోకలైజేషన్ చేస్తామంటూ హామీలిచ్చిన నాయకులు... గెలిచిన తర్వాత ఆ ఊసే లేకుండా చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో 2019లో ఎమ్మెల్యేగా గెలుపొందిన జొన్నలగడ్డ పద్మావతి పట్టుబట్టి శింగనమల చెరువు లోకలైజేషన్‌కు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నుంచి అనుమతులు దక్కేలా చేశారు. ఈ అంశంపై సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ చెరువు మరువ వద్ద అప్పట్లో పైలాన్‌ను ఎమ్మెల్యే పద్మావతి ఆవిష్కరించారు. ఈ సార్వత్రికి ఎన్నికల్లో ఓటమి భయంతో నలిగిపోయిన టీడీపీ నాయకులు నామినేషన్ల దాఖలు సమయంలోనే పైలాన్‌కు ఓ వైపు ఉన్న బండలను ధ్వంసం చేశారు. అనంతరం పోలింగ్ ముగిసిన రోజు రాత్రికి రాత్రే పైలాన్ చుట్టూ ఉన్న బండలను పగులగొట్టారు. ఈ విధ్వంసంపై పలువురు మండిపడుతున్నారు. పైలాన్‌కు సమీపంలో పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో దుండగులు ఎవరైంది స్పష్టంగా నిక్షిప్తమై ఉంటుందని, దాని ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలంటూ కోరుతున్నారు.



కుటుంబసభ్యులతో సరదాగా గడుపుతున్న అనంతపురం ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ



కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న అనంతపురం ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి



తనను పలకరించేందుకు ఇంటి వద్దకు వచ్చిన వారితో మాట్లాడుతున్న రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

● ఒత్తిళ్లకు కాసింత విరామం

ఎన్నికల దృష్ట్యా ఒక్కటెండు నెలలు కాదు... దాదాపు ఎనిమిది నెలలుగా వివిధ కార్యక్రమాల పేరుతో ప్రజల మధ్యనే గడిపిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పోలింగ్ ముగియడంతో మంగళవారం కాస్త రిలాక్స్ అయ్యారు. కుటుంబసభ్యులతో కలసి ఆహ్లాదంగా గడిపారు. వంట చేయడంలో సిద్ధహస్తులైన వారు స్వయం పాకం చేసి ఇంటిల్లిపాదికి పెట్టి ఆనందించారు. కొన్ని నెలలుగా తాము పడిన ఒత్తిడికి విరామం ప్రకటిస్తూ ఆనందోత్సాహాలతో సందడి చేశారు.



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి రంగయ్య



శింగనమల: క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమైన శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, ఆలూరు సాంబశివారెడ్డి

ట్రాలీ బోల్తా - వ్యక్తి మృతి



సురేష్ మృతదేహం

వజ్రకరూరు: ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం చిన్నముష్టూరుకు చెందిన బోయ సురేష్ (30)కు భార్య సునీత, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్న సురేష్ మంగళవారం ఉదయం తన సహచరులు వన్నూరు స్వామి, చిన్నమల్లితో కలసి ట్రాక్టర్‌లో బండలు వేసుకుని వజ్రకరూరుకు బయలుదేరారు. మరి కాసేపట్లో గమ్య స్థానానికి చేరుకుంటారనగా... ట్రాక్టర్ ఇంజన్‌కు సంబంధించిన పెద్ద టైర్ బరస్ట్ కావడంతో వాహనం అదుపు తప్పి పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో ట్రాలీ బోల్తాపడడంతో సురేష్‌పై బండలు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అనంతపురం క్రికెట్ లీగ్-2 ప్రారంభం

అనంతపురం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురం క్రికెట్ లీగ్-2 మంగళవారం ప్రారంభమైంది. ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మెన్, ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛూఫెర్రర్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలు ప్రారంభించారు. అనంతపురం క్రికెట్ లీగ్‌ను రెండో దఫా నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఇలాంటి లీగ్‌ల్లో పాల్గొంటే ఏసీఏ, బీసీసీఐ డొమెస్టిక్ సీజన్‌లో క్రీడాకారులు రాణిస్తారన్నారు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్ జూన్ 30 నుంచి జులై 13 వరకూ కొనసాగుతుందన్నారు. అనంతపురం క్రికెట్ లీగ్ నుంచి నాలుగు టీమ్‌లకు ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లో అవకాశం కల్పిస్తామన్నారు. గ్రామీణ క్రికెట్‌తో ప్రారంభమైన ఆర్డీటీ క్రీడా ప్రస్థానం అంచెలంచెలుగా ఎదుగుతూ పాతికేళ్లుగా ఫుట్‌బాల్, హాకీ, టెన్నిస్, ఆర్చరీ, కబడ్డీ, జూడో తదితర క్రీడాభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. అనంతపురం డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఏడీసీఏ అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, సెక్రెటరీ కె.మధు ఆచారి, ఆర్డీటీ డైరెక్టర్ సాయికృష్ణ, జాయింట్ సెక్రెటరీ భీమలింగారెడ్డి, కోశాధికారి షబ్బీర్ అహమ్మద్, బీసీసీఐ లెవల్ -2 కోచ్ ఎం.శ్రీనివాసరెడ్డి, రంజీ మాజీ క్రీడాకారుడు కేఎస్ షాబుద్దీన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

తోపుదుర్తి కుటుంబం ప్రజలకు రుణపడి ఉంటుంది


తోపుదుర్తి నయనతారెడ్డి

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి ఒక్కరికీ తోపుదుర్తి కుటుంబం రుణపడి ఉంటుందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తోపుదుర్తి నయనతారెడ్డి మంగళవారం తెలియజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం నుంచి రాత్రి అయినా కూడా క్యూలో ఓపికగా నిలబడి ఓటు వేశారని తెలిపారు. సదూర ప్రాంతాలు అమెరికా నుంచి కూడా వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీకి తమకు అండగా నిలిచిన ఆత్మకూరు మండల యువతకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. మహిళలకు అందించిన పథకాలు ఆలోచించి ఓటు వేయడానికి వచ్చారని మళ్లీ కూడా నియోజకవర్గం, రాష్ట్రంలోనూ ఫ్యాన్ ప్రభంజనం సృష్టించేలా కనబడుతోందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లుగా కూర్చున్న వ్యక్తులు పసుపు చొక్కాలు ధరించడం ఎన్నికల నియమావళికి విరుద్ధమన్నారు. ఎంపీ అభ్యర్థిగా ఉన్న పార్థసారథి పసుపు చొక్కా ధరించి నేరుగా పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లారని, వీరిపై ఎన్నికల సంఘం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

18న ఆరాధన గురు మహోత్సవం

అనంతపురం కల్చరల్: కాలజ్ఞాన తత్వవేత్త జగద్గురు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురు పూజా మహోత్సవం ఈనెల 18న ఘనంగా జరుగనుంది. స్థానిక రాణీనగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశేష పూజలు, పంచామృత, పుష్పాభిషేకం, అలంకారాలు, అఖండ దీప ప్రజ్వలన ఉంటాయని ఆలయ నిర్వాహకులు గురుప్రసాద్, కుర్లపల్లి రంగాచారి తెలిపారు. భక్తులందరూ పాల్గొని తీర్థప్రసాదాలందుకోవాలని కోరారు.

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం


వేడుకల్లో సచ్చరిత్ర పారాయణం చేస్తున్న భక్తులు

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో ఉన్న షిరిడీసాయిబాబా ఆలయ 31వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. షిరిడీ సాయి భక్త మండలి సభ్యులు, సేవా సమితి సభ్యులు సంయుక్తంగా వేడుకలు చేపట్టారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు కాగడ హారతి, కలశాలతో ఊరేగింపు, సచ్చరిత్ర పారాయణం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఓబుళాపురంలో కొనసాగుతున్న బందోబస్తు

పుట్లూరు: మండలంలోని ఓబుళాపురంలో సోమవారం ఎన్నికల సందర్భంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగిన విషయం విదితమే. దీంతో గ్రామంలో అల్లర్లు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. ఒక హెడ్ కానిస్టేబుల్, ముగ్గురు కానిస్టేబుళ్లతో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. ఘర్షణలకు దిగిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ జాతర


కూడేరు: హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

కూడేరు: మండలంలోని కమ్మూరులో గ్రామదేవతలైన పెద్దమ్మ, మారెమ్మ జాతర భక్తిశ్రద్ధలతో జరిగింది. మంగళవారం ఆలయంలో మృత్యుంజయ హోమం, యజ్ఞం, తదితర పూజలు వేదపండితులు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్న రంగారెడ్డి, గ్రామపెద్దలు, నిర్వాహకులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బుధవారం పెద్దమ్మ, మారెమ్మలకు ప్రతి ఇంటి నుంచి బోనాలను సమర్పించనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

మరుట్ల-1వ కాలనీలో పోలీస్ పహారా

కూడేరు: మండలంలోని మరుట్ల-1వ కాలనీలో పోలీస్ పహారా కాస్తున్నట్లు సీఐ శివరాముడు మంగళవారం తెలిపారు. సోమవారం పోలింగ్ సందర్భంగా బండారు శ్రీనివాసులు అనే వ్యక్తిపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. గాయపడిన శ్రీనివాసులు పోలీసు స్టేషన్ ఫిర్యాదు చేశాడు. దీంతో గ్రామంలో ఎవరూ ఘర్షణ పడకుండా ఉండేందుకు సీఐ శివరాముడు మరుట్ల-1వ కాలనీలో పర్యటించారు. ఎవరైనా సరే శాంతి భద్రలకు విఘాతం కలిగిస్తే, ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

రాప్తాడులో వెల్లువెత్తిన ఓటరు చైతన్యం

- నియోజకవర్గంలో 85.08 శాతం ఓటింగ్ నమోదు
- రామగిరిలో అత్యధికంగా 90.49 శాతం పోలింగ్


కనగానపల్లి మండలం మామిళ్లపల్లిలో ఓటు వేయటానికి ఉత్సాహంగా వచ్చిన వృద్ధులు


కనగానపల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన మహిళా ఓటర్లు, యువకులు

రాప్తాడు నియోజ వర్గంలో మండలాల వారీగా నమోదైన ఓటింగ్ వివరాలు

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	ఓటింగ్ శాతం
ఆత్మకూరు	33,227	30,010	90.31
అనంతపురం రూరల్	81,451	63,156	77.53
రాప్తాడు	35,493	30,113	84.84
కనగానపల్లి	33,771	30,356	89.88
రామగిరి	29,396	26,602	90.49
చెన్నేకొత్తపల్లి	37,233	32,970	88.55
మొత్తం	2,50,571	2,13,207	85.08

కనగానపల్లి: రాప్తాడు నియోజక వర్గంలో ఓటర్ల చైతన్యం వెల్లువెత్తింది. సార్వత్రిక ఎన్నికల్లో 85.08 శాతం పోలింగ్ నమోదైంది. నియోజక వర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 279 పోలింగ్ స్టేషన్లు ఉండగా, అందులో 2,50,571 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,13,207 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. అధికారులు. దీంతో గత 2019 ఎన్నికల కన్నా సుమారు 10 వేల(3 శాతం) మంది ఎక్కువగా ఓట్లు వేశారు. సమస్యాత్మక ప్రాంతమైన రామగిరి మండలంలో అత్యధికంగా 90.49 శాతం ఓటింగ్ నమోదైంది. ఇక నియోజకవర్గంలో అత్యధికంగా ఓటర్లు ఉన్న అనంతపురం రూరల్ మండలం మాత్రం 77.53 శాతం మంది మాత్రమే ఓట్లు వేశారు. ఈ ఎన్నికల్లో ఎక్కువగా మహిళలు, వృద్ధులు, యువకులు ఉత్సాహంగా పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఓటర్లు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులుదీరారు. దీంతో ఓటింగ్ నమోదు విషయంపై అధికారులు సకాలంలో సరైన సమాచారం అందించలేకపోయారు.

గాయపడిన వ్యక్తి మృతి

గార్లదిన్నె: మండలంలోని కనంపల్లికి చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాలు మేరకు.. మండలంలోని కనంపల్లికి చెందిన సురేంద్ర(36) అనే వ్యక్తి ఈ నెల 2న ద్విచక్రవాహనంలో కల్లూరు నుంచి కనంపల్లికి వస్తూ.. రామ్‌దాస్‌పేట వద్దకు రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు.

ఆటో బోల్తా .. ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని శ్రీపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం ఆటో బోల్తా పడి ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. గుంతకల్లు నుంచి ప్రయాణికులతో గుత్తి వైపునకు ఆటో బయలుదేరింది. శ్రీపురం గ్రామ శివారులో వేగంగా వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో గుంతకల్లు మండలం నక్కనదొడ్డి గ్రామానికి చెందిన లోలోనాయక్, తురకపల్లి గ్రామానికి చెందిన సుంకన్నకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108లో గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గార్లదిన్నెలో మరొకరికి..

గార్లదిన్నె: మండల కేంద్రం 44వ జాతీయ రహదారిపై లోలూరు క్రాస్ సమీపంలో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాలు.. గార్లదిన్నెకు చెందిన వేణుగోపాల్ అనే వ్యక్తి ద్విచ క్రవాహనంలో అనంతపురం వైపు నుంచి గార్లదిన్నెకు వస్తుండగా లోలూరు క్రాస్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి కారు ఢీకొనడంతో వేణుగోపాల్‌కు రక్తగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స చేసి, అనంతపురం ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు.

తొండపాడులో 16న మిశ్రమ బియ్యం వేలం

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన మిశ్రమ బియ్యం సేకరణకు ఈ నెల 16న వేలం నిర్వహించనున్నట్లు ఈఓ రాణి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే జక్కలచెరువు గ్రామ శివారులోని సర్వే నంబర్ 643లోని 8.04 ఎకరాలు, సర్వే నంబర్ 353లోని 1.62 ఎకరాలు, అప్పేచెర్ల గ్రామ శివారులోని సర్వే నంబర్ 359లోని 2.22 ఎకరాలు, సర్వే నంబర్ 115-1లోని 1.60 ఎకరాల భూములను కౌలుకు తీసుకునేందుకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆలయ అవరణలో సాయంత్రం 4గంటల సమయంలో వేలం ఉంటుందని రూ.1,000 డిపాజిట్ చెల్లించాలని ఈఓ తెలిపారు.

పేద కుటుంబానికి 'పెద్దన్న'లా సాయం


ఆర్థికసాయం అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం సెంట్రల్: కడు పేదరికం.. ముగ్గురు కుమార్తెలు.. అందులో ఇద్దరు పిల్లలు మానసిక వికలాంగులు.. ఉండటానికి ఇల్లు కూడా లేదు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో వెన్నుముక దెబ్బ తిని మంచాన పడ్డాడు. ఈ పరిస్థితిలో ఆ ఇల్లాలు కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతోంది. రోజుకు రూ.200 వచ్చే కూలి డబ్బుతో కుటుంబానికి నెట్టుకురాలేక... ఆరోగ్యంగా ఉన్న మూడో కుమార్తె చదువు అర్ధంతరంగా ఆగిపోతుందేమోనని ఆ ఇల్లాలు ఆందోళన చెందుతున్న సమయంలో అమ్మ సంస్థ అధ్యక్షులు తరిమెల రమణారెడ్డి ఆపన్న హస్తం అందించారు. వివరాల్లోకి వెళితే...బుక్కరాయసముద్రం మండలం జంతులూరులో బళ్లారి రవికుమార్, లక్ష్మిదేవి దంపతులు. వీరికి ముగురు ఆడపిల్లలు. మొదటి కుమార్తె మణి(22), రెండో కుమార్తె(శిరీషా(17), మూడో కుమార్తె ఎస్కేరా(15). ఈ ముగ్గురిలో మొదటి ఇద్దరు పుట్టుకతోనే మానసిక వికలాంగులు. దంపతులిద్దరూ పిల్లల కోసం కూలీనాలి చేసుకొని కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. అయితే రెండేళ్ల కిత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న రవికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. వెన్నుముక దెబ్బతినడంతో మంచానికే పరిమితం అయ్యాడు. దీంతో ఆ కుటుంబం పరిస్థితి దయనీయంగా మారిపోయింది. విషయం తెలుసుకున్న అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి రూ. 50వేలు విలువజేసే సరుకులు, పిల్లలకు దుస్తులు, వైద్య ఖర్చులకు రూ. 20వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే మూడవ కుమార్తె ఎస్తేరా చదువు, పోషణ మొత్తం అమ్మ స్వచ్ఛంద సంస్థే భరిస్తుందని భరోసా ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి సాయం చేస్తామని ప్రకటించారు. దీంతో కుటుంబం రమణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు


ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న నాయకులు

ఆత్మకూరు: ఎంతో ఓపికతో క్యూలో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి ఓటరుకు వైఎస్సార్‌సీపీ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి తెలియజేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల నాయకులు విలేకరులతో మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో ఎక్కడా అవాంఛనీయ సంఘనటలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిశాయన్నారు. ముఖ్యంగా మహిళలు ఎంతో ఓపికతో క్యూలో గంటల సమయం నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలు పొందిన మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఎన్నికల సరళిని పరిశీలిస్తే అత్యధిక మెజార్టీతో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మళ్లీ ఎమ్మెల్యేగా గెలుస్తాడనే నమ్మకం కలుగుతోందన్నారు. మండల కన్వీనర్ లక్ష్మినరసింహులు, ఎంపీపీ హేమలత, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, నాయకులు వాసుదేవరెడ్డి, బాలపోతన్న, వన్నూరప్ప, సద్దికూటి శివారెడ్డి, ఓబిఎడ్డి, నరసింహారెడ్డి, ఫణిరెడ్డి, బుషిరెడ్డి, వెంకట్రాముడు, వెంకటేష్, చెన్నారెడ్డి, జయరామిరెడ్డి, అతికిరెడ్డి, ఎర్రిస్వామి, శివారెడ్డి, గోపాల్, రామాంజి, నాగభూషణంరెడ్డి, అంజినేయులు, రామాంజి, ఆదెప్ప, ప్రసాద్, ఓబీ టైలర్ వెంకటేస్, మురళి, పోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిండికేట్‌నగర్‌లో రెచ్చిపోతున్న టీడీపీ శ్రేణులు

రాప్తాడు రూరల్: ప్రశాంతంగా ఉండే అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ సిండికేట్‌నగర్‌లో టీడీపీ శ్రేణులు విధ్వంసాలకు తెరలేపాయి. మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను టీడీపీ నాయకులు రెచ్చగొట్టి దాడులకు తెగబడే ప్రయత్నం చేశారు. ఈ నెల 13న సిండికేట్‌నగర్‌లోని బూత్‌లో పోలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు పరిటాల బంధువు వచ్చాడు. అక్కడే ఉన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆయనతో పాటు బూత్‌లోకి వెళ్లారు. ఆ సమయంలో కొందరు టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయి గొడవకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకోవడంతో అప్పట్లో వివాదం సద్దుమణిగింది. అనంతరం తోపుదుర్తి నయనతారెడ్డి వచ్చి బూత్‌లో పోలింగ్ సరళిని పరిశీలించారు. ఆ సమయంలో కొందరు టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయి వైఎస్సార్‌సీపీ శ్రేణులపై రాళ్లు రువ్వారు. ప్రతిగా కొందరు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలూ రాళ్లు రువ్వారు. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకున్న టీడీపీ నాయకులు మంగళవారం కవ్వింపు చర్యలకు దిగారు. ఇన్‌స్టాగామ్‌లో లైవ్ పెట్టుకుని వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొడుతూ 'వచ్చేది మా ప్రభుత్వమే...ఒక్కొక్కొనాకొడుకు కథ చూస్తాం' అంటూ మాట్లాడారు. అదే సమయంలో గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుతున్న వైఎస్సార్‌సీపీ మద్దతుదారులతో గొడవ పడ్డారు. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. అక్కడి నుంచి చౌడమ్మ గుడి వద్దకు చేరుకున్న టీడీపీ నాయకులు కట్టెలు పట్టుకుని హంగామా చేశారు. సిండికేట్‌నగర్‌లోని ప్రధాన రహదారిలో గుంపులు గుంపులుగా చేరి భయోత్పాతం సృష్టించారు. అదే సమయంలో సీఐ రామకృష్ణారెడ్డి, సిబ్బందితో అక్కడకు చేరుకుని ఇరు వర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రశాంతంగా ఉన్న సిండికేట్‌నగర్‌లో గొడవలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.

ఇష్టారాజ్యంగా విధులు



ప్రభుత సర్వజనాస్పత్రిలో ఇద్దరు, ముగ్గురు మినహా ఖాళీగా కన్పిస్తున్న ఉద్యోగుల సీట్లు

- సర్వజనాస్పత్రిలో ఖాళీగా కన్పించిన ఉద్యోగుల సీట్లు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మినిస్టీరియల్ సిబ్బంది విధులు ఇష్టారాజ్యంగా నిర్వర్తిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కార్యాలయంలో ఉద్యోగుల సీట్లు ఖాళీగా కన్పించాయి. ఇద్దరు, ముగ్గురు ఉద్యోగులు మినహా సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు పత్తా లేకుండా పోయారు. ఆస్పత్రిలో తరచూ ఇటువంటి పరిస్థితే నెలకొనిందని ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఈ సమస్య ఏర్పడుతున్నట్లు విమర్శలున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి జయంతి


కలశాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొస్తున్న ఆర్యవైశ్యులు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి మహోత్సవాన్ని మంగళవారం ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. ఏటా వైశాఖ శుద్ధ సప్తమి రోజున కన్యకా పరమేశ్వరాలయంలో వాసవీ జయంతి కనుల పండువగా నిర్వహించడం ఆనవాయితీ. ఆలయంలో అమ్మవారికి ఉదయం నుంచి 18 రకాల రసాలు, సుగంద ద్రవ్యాలు, వనమూళికలు, పంచామృతాభిషేకాలు అనంతరం క్షీరాభిషేకం నిర్వహించారు. వాసవీ జయంతిని పురస్కరించుకుని ఆలయంలో శీతల పానీయాలు, తీర్థ ప్రసాద పంపిణీ చేశారు. సాయంత్రం ప్రత్యేక పూలతో వెండిపూత రథంలో పుష్పాలంకరణలతో అమ్మవారి చిత్రపటాన్ని ఆర్యవైశ్యులు గ్రామోత్సవం చేశారు.

మనోవేదనతో విశ్రాంత రైల్వే ఉద్యోగి మృతి

గుత్తి: ఇచ్చిన అప్పు తిరిగి రాదనే బెంగతో మనోవేదనకు లోనై విశ్రాంత రైల్వే ఉద్యోగి లక్ష్మీనారాయణ(64) మృతి చెందారు. వివరాలు... గుత్తి ఆర్‌ఎస్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్ సమీపంలో నివాసముంటున్న లక్ష్మీనారాయణ రైల్వేలో పనిచేస్తూ నాలుగేళ్ల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. ఆ సమయంలో వచ్చిన డబ్బులో రూ. 8 లక్షలను తన సహోద్యోగి, స్నేహితుడైన చినబాబు (గుత్తి ఆర్‌ఎస్)కు ఇల్లు కట్టుకునేందుకు అప్పుగా ఇచ్చాడు. ఇందులో రూ.3 లక్షలు తిరిగి ముట్టాయి. మిగిలిన రూ. 5 లక్షలు ఇవ్వలేదు. పలుమార్లు అడిగినా చినబాబు పట్టించుకోలేదు. ఈ క్రమంలో సోమవారం రాత్రి లక్ష్మీనారాయణ తన పెద్దకొడుకు విజయభాస్కర్, కౌన్సిలర్ వెంకటసుబ్బయ్యతో కలసి చినబాబు ఇంటికెళ్లి డబ్బు విషయం లేవనెత్తాడు. ఆ సమయంలో చినబాబు కుమారుడు కరీం డబ్బు ఇచ్చేది లేదు ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకో అని గద్దించాడు. దీంతో డబ్బు తిరిగి రాదనే బాధతో మనోవేదనకు లోనైన లక్ష్మీనారాయణ అక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తమ తండ్రి మృతికి చినబాబు, అతని కుమారుడు కరీమే కారణమని లక్ష్మీనారాయణ కుమారులు విజయ భాస్కర్, దుష్యంత్, రాజేష్ ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుత్ తీగలపై పడిన చెట్టు


జేసీబీతో చెట్టును తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్ రోడ్డులో మంగళవారం ఈదురు గాలులకు ఓ చెట్టు విద్యుత్ తీగలపై పడింది. దీంతో కరెంట్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. మధ్యాహ్నం సుమారు 2.30 గంటల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది జేసీబీ సాయంతో విద్యుత్ తీగలపై పడిన చెట్టును తొలగించి సాయంత్రం 5.30 గంటలకు కరంట్ సరఫరా పునరుద్ధరించారు.

ఉజ్వల హోమ్‌ను తనిఖీ చేసిన జడ్జి


ఉజ్వల హోమ్‌ను తనిఖీ చేస్తున్న జడ్జి శివప్రసాద్

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని పార్వతీనగర్‌లో ఉన్న ఉజ్వల హోమ్‌ను రాష్ట్ర న్యాయ సేవాధి కారి సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ మంగళవారం ఉజ్వల హోమ్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా జడ్జి శివప్రసాద్ ఉజ్వల హోమ్‌లో ఉన్న మహిళలతో మాట్లాడారు. అక్కడ కల్పించిన వసతులపై ఆరాతీశారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వారికి సూచించారు.

ఎన్నికల్లో డబ్బు పంపిణీపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం టవర్‌క్లాక్: సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన పార్టీ అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెటేందుకు డబ్బు, మద్యల్ని పంపిణీ చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ కోరారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారులు నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించకుండా అభ్యర్థులు డబ్బు, మద్యం పంపిణీ చేస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీనివల్ల ప్రజాతీర్పు ప్రభావితమవుతుందన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తున్నానన్నారు. డబ్బు పంపిణీ చేయాలని చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఎన్నికలను రద్దు చేయాలని కోరారు. మడకశిరలో కాంగ్రెస్ అభ్యర్థి డబ్బు పంచారని ఆరోపణలొస్తున్నాయని పాత్రికేయులు ప్రశ్నంచగా తమ పార్టీ అభ్యర్థి డబ్బు పంచలేదని మడకశిరలో కూడా విచారించి చట్టపరమైన చర్యలు తీకోవాలన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్ రెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- పట్టణానికే తలమానికం ప్రసన్న వేంకటరమణస్వామి
- విశిష్ట సంప్రదాయంతో 25న శ్రీవారి కల్యాణోత్సవం
- 27న బ్రహ్మ రథోత్సవం


ప్రసన్న వెంకటరమణస్వామి, అమ్మవారి మూలవిరాట్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన పట్టణానికే తలమానికమైన ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 20 నుంచి 30 వరకు జరగనున్నట్లు గ్రూపు ఆలయాల కార్యనిర్వహణాధికారి కె.నరసింహారెడ్డి మంగళవారం తెలిపారు. వందేళ్ల నుంచి కొనసాగుతున్న విశిష్ట సంప్రదాయంలో భాగంగా 25న తొమ్మిదేళ్ల బాలికతో కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. 27న శ్రీవారి బ్రహ్మ రథోత్సవం జరగనుంది.

శ్రీవారి ఉత్సవ కార్యక్రమాలు ఇలా :

ప్రసన్న వెంకటరమణస్వామి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న కలశస్థాపన, రక్షాబంధనం, 21న ధ్వజారోహణ, సింహ వాహనోత్సవం, 22న సూర్యప్రభ వాహనం, 23న శ్రీవారి శేష వాహనోత్సవం, 24న హనుమద్ వాహనం, 25న కల్యాణోత్సవం, గరుడ వాహనోత్సవం, 26న గజేంద్ర వాహనం, 27న మడుగుతేరు, సాయంత్రం బ్రహ్మరథోత్సవం, 28న పార్వేటోత్సవం, అశ్వ వాహనం, బాణసంచా వేడుక, 29న వసంతోత్సవం, మయూర వాహనం, 30న సప్త శయనోత్సవ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఆలయ చరిత్ర:

ఆలయాన్ని 16వ శతాబ్దంలో కంచి కోదండ రామాచార్యులు నిర్మించినట్లు చరిత్ర చెప్తోంది. ఈ చారిత్రాత్మక ఆలయంలో ప్రతిష్ఠించబడిన వెంకటరమణస్వామి పట్టణ ప్రజల ఆరాధ్య దైవంగా నిత్య పూజలందుకుంటున్నారు. పూర్వం విజయనగర సామ్రాజ్యంలో అంతర్భాగమైన రాయదుర్గం కోటను వెంకటపతినాయుడు పాలించే సమయంలో ఒక నాడు ఆయన సైన్యంతో వేట నిమిత్తం విచ్చేసి ఇక్కడ గుడారాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. వేట బడలికతతో ఆదమరిచి నిద్రిస్తుండగా, అతన్ని ఎవరో వీపు తట్టి లేపినట్లు.. ఈ ప్రాంతంలో శ్రీలక్ష్మీపద్మావతి వెంకటేశ్వర్ల విగ్రహాలు ఉన్నట్లు కల వచ్చింది. ఉషోదయమైన తరువాత ఈ విషయం అతడు తన పరివారానికి తెలియజేశాడు. విగ్రహాలు ఏప్రాంతంలో ఉన్నాయో తెలపాలని స్వామిని వేడుకున్న రాజు.. మరుసటి రోజు నిదురిస్తున్న సమయంలో 'నీవు ఉన్న గుడారం కిందనే మేమున్నాం.. మమ్ముల్ని ఇక్కడే ప్రతిష్టించండి' అని శ్రీస్వామి కలలో చెప్పారట. ఆ తర్వాత ఆయన విగ్రహాలను వెలికితీయించి, ఓ శుభమూహూర్తాన ప్రతిష్ఠించి ఇక్కడ ఆలయాన్ని నిర్మించినట్లు పెద్దలు చెబుతారు.